


# నిదురించే తోటలోకి...

ఏడాదిన్నర పాపను బుజ్జగిస్తూ అన్నం తినిపిస్తోంది మాధురి. కిటికీకి దగ్గర నిల్చోబెట్టి బయటికి చూపిస్తూ గోరు ముద్దలు నోట్లో పెడుతూంది. పాప మారాం చేస్తూంటే దూరం నుండి వస్తున్న సైకిల్‌ను చూపిస్తూ... "అదిగో.. బూచోడొస్తున్నాడు. తొందరగాతినమ్మా!.. పట్టుకుపోతాడు తెల్సా?" అంటూ తినిపిస్తోంది. పాప బెదరలేదు. అలావస్తున్న సైకిల్‌ని ఓసారి తీక్షణంగా చూసింది

మాధురి.

అదే డొక్కు సైకిలు...

అదే వ్యక్తి....

అదే ఖాకీ డ్రెస్సు...

అదే జబ్బ సంచి...

అతను... తనింటి వైపే వస్తున్నాడు. మాధురి గుండెల్లో గుబులు పేరుకుంది.

గుండె దడ పెరిగింది. గోరుముద్దులు కలపటం మర్చిపోయి... నిశ్చేష్టురాలైంది. అతను ఖచ్చితంగా మాదురి ఇంటివైపే వస్తున్నాడు. పాపను కిటికీ లోంచి దించి ముందు గదిలోకి వచ్చింది. కాని ముందు గదిలో వేసిన తలుపులు తీయడానికే కాళ్లు, చేతులు వణుకుతున్నాయి. కుర్చీలో కూలబడి ఆ పాటికే మౌనంగా రోదిస్తూంది.

బయట సైకిల్ బెల్ రెండుసార్లు విన్పించింది.... ఆ తర్వాత "పోస్ట్" అన్న కేక విన్పించింది. అయినా ఆమె లేవలేదు. అతను తెచ్చే కవరు తనకు తెలుసు. అందులో ఏముంటుందో కూడా తెలుసు. అందుకు అతనన్నా... అతడు తెచ్చే వార్తన్నా మాధురికి భయం... బయట పోస్ట్‌మాన్ మరో రెండుసార్లు అరిచాడు. తర్వాత తలుపు సందునుండి ఒక పచ్చటి కవరు నిశ్శబ్దంగా ముందు గదిలో పడింది.

మోకాలు మీద తల ఆనించి మూగగా ఏడుస్తోంది. పాప కూడా తప్పటడుగులేస్తూ ముందు గదిలోకి వచ్చింది. మాధురికి గతం గుర్తుకొస్తుంది. అనాటి తీపి కలలు ఈనాడు ఆమె పాలిటి మృత్యువులా తయారయ్యాయి. పాప కవరు తీసుకొచ్చి 'మమ్మీ' అంటూ ఇచ్చింది. కవరందుకుంది భయం... భయంగా! తన అడ్రసుతో అదే రైటింగు, ధైర్యం కూడా తీసుకుంటూ కవర్ చించింది.

"గౌరవనీయులైన శ్రీమతి మాధురి గారికి...

ఇంతకుముందు మా కుటుంబ దీనగాథ మీకు రాశాను. మరోసారి మీకు గుర్తుచేస్తున్నాను. మీకు పెళ్లికాక ముందు మా అన్నయ్యని ప్రేమించారు. మీ అవసరాలకు తిప్పుకున్నారు. చివరికి ఎలాగైతేనేం ఓ ధనవంతుడ్ని పెళ్లి చేసుకున్నారు. మీ పెళ్లయ్యాక మా కుటుంబాన్ని పోషించే ఒక్కగానొక్క మా అన్నయ్య పిచ్చివాడయ్యాడు. ఉద్యోగానికి రాజీనామా చేసి తాగుబోతయ్యాడు. చివరికి మిమ్మల్నే కలవరిస్తూ... మమ్మల్ని విడిచిపోయాడు.

అన్నయ్య చనిపోయిన అయిదు నెలలు కావస్తున్నా మంచం పట్టిన మా అమ్మ మూసిన కన్ను తెరవటం లేదు. ఈ పరిస్థితుల్లో డిగ్రీ డిస్‌కంటిన్యూ చేసిన నాకు ఉద్యోగం లేక ఎవరినీ పోషించలేక పోతున్నాను. ఈ పరిస్థితి గ్రహించిన "అక్క" తన దారి తాను చూసుకుంది. మా వటవృక్షం కూలిపోయినందుకు నేడో రేపో మా కుటుంబం బజారున పడనుంది.

ఇంత జరిగిన మా అందరికి ఒక్కటే తెల్సు. మీవల్లనే ఇదంతా జరిగింది. అన్నయ్య పోవడంతో మా కుటుంబం చిన్నాభిన్నమైంది. అందుకే మీరంటే నాకు

కసి... ద్వేషం,... పగ! అదే మీ మీద తీర్చుకుంటున్నాను. నాకో ఉద్యోగం ఇవ్వడానికి లక్ష రూపాయలు అడిగారు. ఇది బ్లాక్‌మెయిల్ అనుకోండి మరేదేనా అనుకోండి. అర్జంటుగా డబ్బు పంపకపోతే అన్నయ్యకు "మీరు రాసిన ఉత్తరాలు... మీ ఫోటోలు" మీ వారికి పంపించి మీ జీవితాన్ని నరకప్రాయం చేయాల్సి వస్తుంది.

మేం అనుభవించిన నరకం... మానసిక వేదన మీరు కూడా చవిచూడాలి. మీ పరువు బజార్నపడాలి. డబ్బు పంపనట్లయితే వచ్చే ఉత్తరం మీ వారికే అందుతుంది. ఆలోచించుకోండి. - రాజేష్

ఉత్తరం చదివి మాధురి భయంతో కుంచించుకుపోయింది. భయంగా పాపను ఒడిలోకి తీసుకొని బావురుమంది. ఏడ్చి... ఏడ్చి వెక్కిళ్లు ఆగిపోయినా కన్నీళ్లు ధారాపాతంగా కారుతూనే వున్నాయి.

ఏ కల్మషం అంటని పాప తల్లిని అయోమయంగా చూస్తూండి పోయింది. ఆలోచనలో పడ్డ మాధురికి తలుపు చప్పుడవటంతో మరింత దుఃఖం పొంగిపొర్లింది. గబగబా ఉత్తరాన్ని చింపేసి కిటికీ గుండా పడేసింది. మరోసారి తలుపుచప్పుడు... కళ్లు కడుక్కొని నెమ్మదిగా తలుపు తీసింది.

ఎదురుగా చిరునవ్వుతో శ్రీకాంత్!!

ఆమె భర్త !!

తత్తరపాటుని అణిచిపెట్టుకొని నవ్వడానికే ప్రయత్నించింది. శ్రీకాంత్ మాధురిని విష్ చేసి లోపలికెళ్లి పాపను ముద్దాడటంలో మునిగిపోయాడు. అరగంట

తర్వాత మాధురి మామూలు స్థితికి వచ్చింది. భర్త ముఖంలోకి చూడలేక మౌనంగా వుంటోంది.

ఆమె మౌనం శ్రీకాంత్‌కు అర్థంగాదు.

ఆమె డబ్బు గురించి ఆలోచిస్తోంది. ఒక కొలిక్కి రాని ఆలోచనలు! గుండెను తొలిచేస్తూ ఆమెలోని ఆక్టివ్‌నెస్‌ని తినేసాయి.

భయం... నీరసం... మాధురి బ్రతుకుని దుర్భరం చేసాయి. శ్రీకాంత్ పేర లెటర్ వస్తే... అన్న ఊహ ఆమె ఆరోగ్యాన్ని కూడా దెబ్బతీసింది. సైకిల్ బెల్ విన్పించినా, పోస్ట్‌మెన్ కన్పించినా బిగుసుకు పోయేది.

వారం రోజులు గడిచాయి. ఓ మంగళవారంరోజు ఆఫీసుకి సెలవుండి శ్రీకాంత్ ముందు గదిలోకూచొని మ్యాగజైన్ తిరగేస్తున్నాడు.

"పోస్ట్... శ్రీకాంత్‌గారు" అన్న కేక విన్పించింది. వంటగదిలో ఏవో సర్దుతున్న మాధురి గుండెల్లో బాంబులు పేలాయి. చితికిపోతున్న బతుకు కూలిపోయే మృత్యుశాసనాన్ని అతడు అందించాడనుకుంది. ఒక్క ఉదుటున ముందుగదిలోకి వచ్చింది. అప్పటికే శ్రీకాంత్ కవరందుకుని చించుతున్నాడు. మాధురి అకస్మికంగా లాక్కొంది. క్షణాల్లో ఆమె చేతిలో ఉత్తరం ముక్కలు ముక్కలయ్యింది. శ్రీకాంత్ నివ్వెరపోయాడు.

ఉన్మాదిలా "ఈ ఉత్తరం మీరు చదువొద్దు... మీరు చదువొద్దు..." అంటూ టేబిల్ పై తల ఆనించి రోదించసాగింది. ఉత్తరం ముక్కలు గాలికెక్కడెక్కడో

ఎగిరిపోయాయి.

శ్రీకాంత్ విభ్రాంతి లోంచి తేరుకోలేదు. నోటిమాట రాక అలాగే నిల్చుండిపోయాడు. అతడు ఏ సమస్యనయినా తేలిగ్గా తీసుకుంటాడు. నూటికో, కోటికో ఒక్కరిలో వుండే ఆ గొప్పనైజం శ్రీకాంత్‌లో ఉంది. మాధురిలో కన్పిస్తున్న మార్పుని గమనిస్తూనే వున్నా ఏ కారణం అడగొద్దని... రోదిస్తున్న భార్య భుజం మీద చేయివేసి ఆప్యాయంగా నొక్కాడు.

"ఎందుకు మాధురీ... ఏమిటేపని! ఎందుకు ఆ కన్నీళ్లు?" అని మాత్రం అడిగాడు. ఆ మాటకు దుఃఖం కట్టలు తెంచుకొని శ్రీకాంత్ భుజంమీద వాలిపోయి ఏడ్చింది. ఆమెను గుండెలకు హత్తుకొని మెల్లగా బెడ్‌రూంలోకి తీసుకొచ్చి పడుకోబెట్టాడు.

ఆమె  అలాగే రోదిస్తూంది. ఏడుపందుకొన్న పాపనెత్తుకొని శ్రీకాంత్ తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

ఇది జరిగిన మూడో రోజున...

మాధురి కోసం వాళ్ళ 'బాబాయి' వచ్చాడు. ఆయన ముఖంలో విషాదం తొంగిచూస్తోంది. మాధురి, శ్రీకాంత్ ఆయన్ని సాదరంగా ఆహ్వానించారు.

"రండి బాబాయ్... ఇప్పుడే వస్తున్నావా? లోపలికి రండి" అంది మాధురి.

"ఇంటిదగ్గర అందరూ బావున్నారా మామయ్య?" అడిగాడు శ్రీకాంత్.

బాబాయ్ నోటినుండి బరువైన నిట్టూర్పు.

"అమ్మా...మాధురీ! నీకోసం మీ తాతయ్య చాలా కలవరించాడమ్మా మీ అమ్మా నాన్న పోయింతర్వాత ఆయన నీకోసమే బ్రతుకుతూ నిన్న ప్రాణప్రదంగా పెంచాడు. ప్చ్... చివరి చూపుకు కూడా నువ్వ రాలేదేమిటమ్మా" అన్నాడయన కూచుంటూ.

"ఏమిటి బాబాయ్ మీరంటున్నది?" మాధురి మాట ముగించకముందే ఆయనన్నాడు.

"ఆయన కన్నుమూసి వారం రోజులు దాటింది. ఆయన చనిపోయిన వెంటనే ఆ పల్లెటూల్లో ఫోన్లు, టెలిగ్రాం వసతుల్లేక లెటర్ రాసాను కదమ్మా! అది అందుకొనైనా నువ్వొస్తావని చూసాం. నువ్వు రాకపోయేసరికి కంగారుపడ్తూ నేనే వచ్చానమ్మా" అన్నాడయన కళ్ళనీళ్లు తెచ్చుకుంటూ... శ్రీకాంత్‌కు ఏం మాట్లాడలో అర్థంకావట్లేదు.

గుండె పగిలి... కన్నీటి కెరటాలు మెదడుని ముంచేస్తే సొమ్మసిల్లిన మాధురి అచేతనంగా గోడకు జారగిలపడింది.

xxx xxx xxx

మాధురి కళ్లు తెరిచే సరికి ఆస్పత్రిలో వుంది. తన తాతయ్య చావుకబురు తావే చేతులారా చింపేసుకుంది.

తన ఈ బ్రతుక్కి నిష్కృతి లేదు...

కాటేసిన ప్రేమ కన్నవాళ్లనీ... కట్టుకున్న వాడిని దూరం చేస్తోంది. ఆనాడు అమృతమనుకున్నది ఇప్పుడు విష ప్రయోగమై ఒక కుటుంబాన్నే నిర్వీర్యం చేస్తుంది. ఆమె కళ్ల వెంట జలపాతంలా నీరు కారుతూనే వుంది.

డాక్టర్ పరీక్ష చేసాక మాధురికి పెద్దషాక్ తగిలిందని.... ముఖ్యంగా స్థలమార్పిడి అవసరమని చెప్పి మెడిసిన్స్ రాసిచ్చాడు. మాధురి బెడ్ దగ్గర పాపను ఆడిస్తూ మాధురిని ఓదారుస్తూ వాళ్ల బాబాయ్ రెండురోజులు గడిపాడు.

ఆ రెండు రోజులు శ్రీకాంత్ బెడ్ దగ్గరికి కాదుకదా కనీసం హాస్పిటల్‌కైనా రాలేదు. దీంతో మాధురికి మరింత భయం పట్టుకుంది.

భర్త తనకు దూరమవుతున్నాడేమో నన్న బాధ... ఈ రెండు రోజుల్లో ఆయనకు ఏ ఉత్తరం అందిందో నన్న భయం కలగలసి దుఃఖంగా మారుతున్నాయి.

నిస్సహాయ స్థితిలో మనసు చిక్కబట్టుకొని భర్తకోసం చూసింది. మూడో రోజున శ్రీకాంత్ వచ్చాడు. పూర్తి అలసటతో ముఖం చెప్తోంది. అతడి ఖిన్నవదనాన్ని చూడగానే మాధురి కళ్ళు చెమర్చాయి. మరో సమయంలో అయితే ముద్దుల్లో ముంచెత్తి అలసత్వాన్ని క్షణాల్లో పోగొట్టేది. ఆమె కళ్లలోని నీళ్లు చూసి శ్రీకాంత్ ఆప్యాయంగా తల నిమిరాడు.

"మాధురీ, డాక్టర్ గారు ఏం భయం లేదన్నారు. స్థల మార్పిడి అవసరమన్నాడు. అందుకే మాధురీ... ఈ రెండు రోజులూ తిరిగి మనకు బెంగుళూరు ట్రాన్స్‌ఫర్ చేయించాను.

రెండు మూడు రోజుల్లో మనం బెంగుళూరు వెళుతున్నాం. నీకిష్టమేనా మాధురీ" అనడిగాడు శ్రీకాంత్ ప్రేమగా.

మాధురిలో ఆర్తితో నిండిన కన్నీళ్ళు...

"ఏమండీ... ఈరోజే... మళ్లీ ఇటు రాకుండా... దూరంగా... బెంగుళూర్‌కే వెళ్దామండి... మనం ఇక్కడ్నించి పారిపోవాలి... మనం పారిపోదామండి" తన్నుకొస్తున్న కన్నీరు శ్రీకాంత్ ఒడిని తడిపేస్తుంటే ఒళ్లో తలదాచుకొని ఏడుస్తోంది మాధురి.

"తప్పకుండా రేపే వెలదాం..." అంటూ గుండెల్లో ఆమెను దాచుకున్నాడు శ్రీకాంత్.

xxx xxx xxx

రైలు వేగాన్నందుకుంది. బయట కటిక చీకటి.

రెండవ బెర్తుమీద తేలికపడ్డ మనసుతో నిద్రపోతున్న మాధురి... ప్రక్కలో అంతకంటే ప్రశాంతమైన నిద్రలో పాప....

శ్రీకాంత్ కిటికీలోంచి చూస్తూ అనుకున్నాడు.

"మాధురీ... ఈ ధరిత్రి మీద జరిగిన నాటి ప్రేమ కథలన్నీ చరిత్రలో ఉన్నత శిఖరాలై నిలిచిపోవచ్చు. కాని నేటి ప్రేమకథలు చరిత్రలోకి విసిరేయబడ్డ గులక రాళ్ళుగానే మిగిలిపోతున్నాయి. కారణం...

ఈ ప్రేమల్లో అమరం లేదు... సమరంలేదు... వాడుకోవటాలు... బ్లాక్

మెయిలింగులు తప్ప....

అందుకే నువ్వు చెప్పకపోయిన నీ గతం నాకు తెలుసు మాధురీ. ఎదుటివారి స్థితిని అర్థం చేసుకునే వ్యక్తిత్వం నాకుంది. అందుకే నీకు ఉత్తరాలు రాసిన 'రాజేష్'కి ఉద్యోగం కల్పించి వస్తున్నాను. నీ గతాన్ని తవ్వి నిన్ను దూరం చేసుకుని నన్ను నేను, నా పాపను అనాథలుగా చేయదల్చుకోలేదు..."

శ్రీకాంత్ ఔన్నత్యానికి జైకొడుతున్నట్టు రైలు కూతేస్తూ సాగిపోతోంది.

*